క్లుప్తంగా

అభినందనలు



ఎంపీపీ సత్యవంతుడును అభినందిస్తున్న వైస్ఎంపీపీ అడపా ఈశ్వరరావు, తదితరులు

వేపాడ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ కార్యదర్శిగా మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడును నియమించడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీనివాసరావుతో పాటు పలువురు మండల నాయకులు, అభిమానులు ఎంపీపీని అతని స్వగృహం వద్ద శనివారం సత్కరించి, అభినందనలు తెలియజేశారు.అలాగే పార్టీ మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబుతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సత్యవంతుడిని ఫోన్‌లో అభినందించారు.

సందర్శన



గంట్యాడ పాఠశాలను సందర్శించిన డైట్ అధ్యాపకులు

గంట్యాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డైట్ అధ్యాపకులు బి. సూర్యకళ, కె. రంజిత, డి. సౌమ్య ఇందిర శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు అంశాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం అంచనా వేశారు. చేరికలు, మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అలమండ ఝాన్సీ పాల్గొన్నారు.

జూలై 9న దేశవ్యాప్త సమ్మె



సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గజపతినగరం: వచ్చే నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, మినీ వర్కర్లు పాల్గొంటున్నారని అంగన్‌వాడీ వర్కర్ల అధ్యక్షురాలు సుభాషిని తెలిపారు. ఈ మేరకు సీడీపీఓ ఎం. రాజేశ్వరిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సుభాషిని విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 42 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనంగా రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వై.నారాయణమ్మ, టి.త్రివేణి, సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవలో 'గురుదేవా'



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేసిన విర్గో ఫౌండేషన్ ప్రతినిధులు

కొత్తవలస : దివ్యాంగుల సేవల్లో గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ పరితపిస్తోందని విర్గో ఫౌండేషన్ జీఎం టి.ప్రవీణ అన్నారు. మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్ట్‌లో విర్గో ఫౌండేషన్ సహకారంతో 200 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ఉపకరణాలను శనివారం పంపిణీ చేసశారు. ఈ సందర్భంగా ప్రవీణ మాట్లాడుతూ.. ట్రస్ట్ చైర్మన్ జగదీష్ బాబు తన జీవితాన్ని దివ్యాంగుల సేవలకే అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

జలవనరులను కాపాడుకోవాలి



కొట్టాం హైస్కూల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: జల వనరులను మనమే కాపాడుకోవాలని గ్రీన్ క్లైమెట్ టీమ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి జేవీ రత్నం పిలుపునిచ్చారు. కొట్టాం ఉన్నత పాఠశాలలో గ్రీన్ క్లైమేట్ సభ్యులు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీ రత్నం మాట్లాడుతూ.. జలవనరులను కలుషితం చేయకూడంగా, పర్యావరణ హితంగా బతకాలన్నారు. హెచ్ఎం విజయ్‌రామ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు మొక్కలు నాటుతూ సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఫలితమివ్వని 'ఆత్మగౌరవం'

- 2014 – 19లో ఆత్మగౌరవం పేరిట గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు
- వినియోగానికి నోచుకోని వైనం



వంగపల్లిపేటలో శిథిలావస్థకు చేరుకున్న ఆత్మగౌరవం మరుగుదొడ్లు

చీపురుపల్లి: టీడీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆత్మగౌరవం సామాజిక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. తాజాగా వీటి పరిస్థితి చూస్తుంటే ప్రజల కోసం కాకుండా టీడీపీ కార్యకర్తల కోసమే నిర్మించినట్లు ఉందని చర్చ జరుగుతోంది. ఏ గ్రామంలో చూసినా ఆత్మగౌరవం మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. 2014 నుంచి 2019 మధ్యన టీడీపీ ప్రభుత్వం ఎక్కడికక్కడే ఆత్మగౌరవం పేరుతో సామాజిక మరుగుదొడ్లు నిర్మించింది. లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులు వెచ్చించి ఆత్మగౌరవం మరుగుదొడ్లు నిర్మించారు. అందులో భాగంగానే చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని వంగపల్లిపేట, జి.అగ్రహారం, పిల్లపేట, తదితర ప్రాంతాల్లో ఆత్మగౌరవం పేరుతో సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు. అయితే వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో వృథాగా మారాయి. ప్రస్తుతం చాలా చోట్ల శిథిలావస్థకు చేరాయి. చాలా చోట్ల మరుగుదొడ్లకు సంబంధించిన తలుపులు, ఇతర వస్తువులను చోరులు అపహరించుకుపోయారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువస్తారో, లేదో చూడాలి మరి.

ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఆశయ్య

- ఆర్డీఓ ఆశయ్య

చీపురుపల్లి: ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలు పెంచుకునే అవకాశం ఉంటుందని ఇన్‌చార్జ్ ఆర్డీఓ బి.ఆశయ్య అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1200 మంది ఓటర్లు కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న చోట పోలింగ్ కేంద్రాలు పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా పోలింగ్ కేంద్రాల పేర్లు, చిరునామా మార్చుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందు ల్లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ ఎన్నో సంస్కరణలు తీసుకొస్తోందన్నారు. సమర్థవంతమైన ఓటర్ల జాబితాలతో పాటు పకడ్బందీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాల్లో ఎన్నికల కమిషన్ కల్పిస్తున్న అవకాశాలను రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ధర్మరాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.హర్షవర్ధిని, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



చీపురుపల్లిలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సురేష్, తదితరులు

చీపురుపల్లి: చీపురుపల్లి మేజర్ పంచాయతీలో శనివారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి డీవీ మల్లికార్జునరావు ఆదేశాల మేరకు మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి సూచనలతో పారిశుధ్య పనులు నిర్వహించారు. అందులో భాగంగానే పట్టణంలోని వంగపల్లిపేట, జి.అగ్రహారం, మెట్టకాలనీ, పిల్లపేట, కుమ్మరికాలనీ, కొత్తఅగ్రహారం, విజయాకాలనీ, రామాంజనేయకాలనీ, ఆంజనేయపురం, తదితర ప్రాంతాల్లో జేసీబీ యంత్రాల సహాయంతో చెత్త కుప్పలను ఎత్తి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. అంతేకాకుండా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించారు. అలాగే రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ పనులు చేయించారు. పారిశుధ్య పనులను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఐ.సురేష్ నేతృత్వంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, కార్యదర్శి వై.ఝాన్సీ, జూనియర్ అసిస్టెంట్ పి.రామ్మోహనరావు పర్యవేక్షించారు.

విద్యార్థులు ఎందుకు తగ్గారు..

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంఈఓ – 2ను నిలదీసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- అన్ని ఆర్ఎస్‌కేల్లో ఎరువులు అందుబాటులో ఉంచండి



ఎంఈఓ -2 ధర్మశ్రీనును ప్రశ్నిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: గతేడాది కంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిందని ఎంఈఓ -2 ధర్మ శ్రీనును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు గతేడాది 4,283 మంది చదివితే ఈఏడాది 3,993 మంది ఉన్నారని.. విద్యార్థులు పెరగాల్సింది పోయి తగ్గడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖకు సంబంధించిన వివరాలను ఎంఈఓ -2 ధర్మశ్రీను వివరిస్తుండగా.. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు కలుగజేసుకుని విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిందని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిచేయాలని సూచించారు. అనంతరం వ్యవసాయశాఖకు సంబంధించి ఏఓ శ్రావణితేజ వివరాలు వెల్లడిస్తుండగా.. ఇప్పలవలస ఎంపీటీసీ సభ్యుడు సాంబ కలుగజేసుకుని ఏడాది కాలంగా మా గ్రామంలో ఉన్న రైతుసేవా కేంద్రానికి ఎరువులు రాలేదని, దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనికి చైర్మన్ శ్రీనివాసరావు స్పందిస్తూ వెంటనే ఇప్పలవలస రైతుసేవా కేంద్రంలో ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని ఏఓకు సూచించారు. అనంతరం ఆరోగ్యశాఖకు సంబంధించిన వివరాలను మెరకముడిదాం పీహెచ్‌సీ వైద్యాధికారి అజిత్‌కుమార్ వివరించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. అనంతరం విద్యుత్‌శాఖకు సంబంధించిన వివరాలను ఏపీఎస్ఈబీ ఏఈ దివాకర్ వివరిస్తుండగా.. గరుగుబిల్లి ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్ కొండలరావు (చిరంజీవిరావు) కలుగజేసుకుని తమ గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అదే సమయంలో సర్పంచ్ ఆవాల అప్పలనాయుడు మాట్లాడుతూ.. లో ఓల్టేజీ వల్ల పాఠశాలలో విద్యార్థులకు నీరు సరఫరా కావడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి చైర్మన్ శ్రీనివాసరావు స్పందిస్తూ.. వెంటనే లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మెరకముడిదాం కేజీబీవీ, గర్భాం ఏపీ మోడల్‌స్కూల్‌లో విద్యార్థుల చేరికలు, వసతి సౌకర్యాలపై జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆరా తీశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కందుల పార్వతి, ఎంపీడీఓ గొర్లె భాస్కరరావు, తహసీల్దార్ సులోచనారాణి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలానికి చెందిన పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి...



గజపతినగరం: తహసీల్దార్ రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా అండ్ ప్రింట్ మీడియా ప్రతినిధులు



గజపతినగరం రూరల్: ఎస్సై లక్ష్మణరావుకు ఫిర్యాదు చేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

గజపతినగరం/గజపతినగరం రూరల్: జిల్లా కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న 10 టీవీ స్టాఫ్ రిపోర్టర్ ఎం.ఎం.ఎల్ నాయుడిపై దురుసుగా వ్యవహరించడంతో పాటు సెల్‌ఫోన్ తీసుకున్న టూటౌన్ ఎస్సై మురళిపై చర్యలు తీసుకోవాలని పలువురు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎస్సై కిరణ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మీడియా రంగ ప్రతినిధులనే బెదిరిస్తే ఎలా అని ప్రశ్నించారు. మీడియా స్వేచ్ఛను రక్షించాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో జర్నలిస్టులు సత్యనారాయణ, నాయుడు, గోవింద్, రాజు, వెంకటరావు, శంకరరావు, జగదీష్, పైడిరాజు, రవి, లక్ష్మణరావు, తదితరులు అంతా పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ



చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ అర్జున

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 35 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన అమనాపు చరణ్‌కుమార్ తన తల్లి జ్ఞాపకార్థం పెన్నులు, పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అర్జున మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విద్యార్థులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన



లక్ష్మీపురంలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు

జామి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఎంపీడీఓ ఎస్.అప్పలనాయుడు శనివారం పర్యటించి తడి, పొడి చెత్త సేకరణపై గ్రామస్తులు, అంబాసిడర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తను పారిశుధ్య సిబ్బంది అందజేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.ఉమ, గ్రామానికి చెందిన మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ

లక్కవరపుకోట: బహుజన సమాజ్‌వాదీ పార్టీని గ్రామ స్థాయినుంచి బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ కోరారు. మండల కేంద్రంలో గల అంబేద్కర్ భవనంలో పార్టీ నియోకవర్గ స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా బోను రమణ, కొట్యాడ అప్పారావు.. అధ్యక్షుడిగా దోని అప్పారావు.. ఉపాధ్యక్షుడిగా గనివాడ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ఎల్లపు నగేష్, జాయింట్ కార్యదర్శిగా లింగాల దేవుడు, కోశాధికారిగా మొయ్యి వెంకటరమణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తత తప్పనిసరి

దత్తిరాజేరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పాచలవలస, రామచంద్రాపురం గ్రామాలలో శనివారం పర్యటించి, పరిసరాలను పరిశీలించారు. తాగునీటి ట్యాంకులు, కాలువల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు బ్లీచింగ్ పిచికారీ చేయాలని కార్యదర్శులను ఆదేశించారు.

మలేరియాపై అవగాహన..

దత్తిరాజేరు: మలేరియా వ్యాధి దరి చేరకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రఘు అన్నారు. రామచంద్రాపురం ఉన్నత పాఠశాలలో మలేరియా వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా ప్రమాదకరమైనదని.. ఈ వ్యాధి నుంచి రక్షణ పొందాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాత టైర్లు, మట్టి కుండలు, ఖాళీ కొబ్బరి బొండాలు ఇళ్ల పరిసరాల్లో ఉండకుండా చూడాలని సూచించారు. అలాగే మురుగునీటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గిరిబాబు, మురళి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేసి ఆదుకోండి..

వేపాడ: చర్మ, డప్పు కళాకారులకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ప్రజా వాగ్గేయకారుడు అతవ ఉదయ్ భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఆతవలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 40 ఏళ్లు దాటిన డప్పు కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలన్నారు. 2018లో జారీ చేసిన జీఓ 199, 191 ఉత్తర్వుల మేరకు చాలామంది పింఛన్లు పొందుతున్నారన్నారు. అర్హులైన మరికొందరు అర్జీలు చేసుకునేందుకు ఆన్‌లైన్ యాప్ ఓపెన్ చేసి వారికి న్యాయం చేయాలన్నారు.

జీవనోపాధి మెరుగుపరచడమే లక్ష్యం

- ఎంపీడీఓ అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పలనాయుడు

జామి: గిరిజనవర్గాల జీవనోపాధి వారికి కనీస సౌకర్యాలు కల్పించడమే 'పీఎం జన్‌మన్' కార్యక్రమం లక్ష్యమని ఎంపీడీఓ ఎస్.అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రామయ్యపాలెం పంచాయతీ గదబపాలెం గ్రామంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు తాగునీరు, సురక్షితమైన గృహాలు, విద్య, పారిశుధ్యం, జీవనోపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచవచ్చనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలపై గిరిజనులతో మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి జి.ఉమ, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంతో ఉజ్వల భవిష్యత్



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

వేపాడ: బాలికలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం కిశోర వికాసం అనే కార్యక్రమం చేపట్టిందని.. కిశోర వికాసంతోనే ఉజ్వల భవిష్యత్ సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.అరుణశ్రీ, పి.భాగ్యవతి అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ.. 11 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు గల బాలికలకు విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, నైపుణ్యాల పెంపుదల, పోటీతత్వం, తదితర అంశాలపై చైతన్యపరిచేందుకు కిశోర వికాసం దోహదపడుతుందని చెప్పారు. అనంతరం గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహ కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగలక్ష్మి, రాజేశ్వరి, దేవి, ఈశ్వరమ్మ, లత, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

రూ. 25 లక్షల విలువైన పరికరాల వితరణ



ఆస్పత్రికి పరికరాలను అందజేసిన వారిని అభినందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి దాతలు సమకూర్చిన 25 లక్షల రూపాయల విలువైన పరికరాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. దాతలు సమకూర్చిన ఆధునిక ఆస్పత్రి పరికరాల ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. అనంతరం ఆస్పత్రి భవన నిర్మాణాలు పరిశీలించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, మాజీ ఎంపీపీ మక్కువ శ్రీధర్, సీనియర్ నాయకుడు ప్రదీప్‌కుమార్, ఆస్పత్రి సూపరింటిండెంట్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సమావేశాలు



ముషిడిపల్లిలో సమావేశానికి హాజరైన ఆదివాసీలు

శృంగవరపుకోట: ప్రభుత్వం ప్రారంభించిన పీవీటీజీ గ్రామసభలను మండల యంత్రాంగం మొక్కుబడిగానే నిర్వహిస్తోంది. మండలంలోని ముషిడిపల్లిలో దర్తీ ఆభాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజేజీయూఏ) సమావేశాన్ని ఈఓపీఆర్డీ లక్ష్మి నేతృత్వంలో పంచాయతీ కార్యదర్శి అనిల్ శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ రఘురాజు, సర్పంచ్ ఎస్.దారప్ప, హౌసింగ్ ఏఈ, ఐసీడీఎస్ పీఓ అచ్యుత హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు గిరిజనులతో మాట్లాడుతూ.. ఆధార్, రేషన్, ఆయుష్మాన్‌భారత్, కేసీసీ, జన్‌ధన్ ఖాతా, గ్యాస్ కనెక్షన్ కార్డులు కావాలా అని అడగ్గా వారి నుంచి పెద్దగా స్పందన రాలేదు. దీంతో సభ తూతూమంత్రంగా చేపట్టి ముగించారు.

నీరుగారిన ఉద్దేశం


వ్యక్తిగత హక్కులపై అవగాహన పెంచడం, ఇంటి వద్దకే ధ్రువపత్రాలు అందివ్వడం, ప్రభుత్వ పథకాల్లో భాగస్వాముల్ని చేయడం, గిరిజన యువతను డిజిటల్ వారియర్స్‌గా మార్చడం, ఎస్‌సీడీ స్క్రీనింగ్ చేయడమే ఈ మిషన్ లక్ష్యాలు. కాగా ఇవేమీ క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. కొండలపై ఉన్న గ్రామాలకు వెళ్లకుండా, వారినే మైదానప్రాంతాలకు తీసుకువచ్చి సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఐటీడీఏ భాగస్వామ్యం లేదు..

ప్రధానంగా ఈ సభలకు ఐటీడీఏ అధికారులు వచ్చి పీవీటీజీ జీవన ప్రమాణాల మెరుగు ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉంది. అయితే ఎస్.కోట ఐటీడీఏ సబ్‌ప్లాన్ ఏరియాలో లేకపోవడంతో ఐటీడీఏ అధికారుల భాగస్వామ్యం ఉండదు. దీంతో ప్రభుత్వం నుంచి గిరిజన తెగలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందడం లేదు. గిరిజనంలో ప్రత్యేకంగా కొన్ని తెగల జీవన ప్రమణాలు పెంచాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం డీఏజేజీయూఏ పథకం అమలు చేస్తోంది. గతంలో పీటీజీలుగా పిలవబడే కొన్ని గిరిజన తెగలను తర్వాత కేంద్రం పీవీటీజీలుగా (పర్టిక్యులర్లీ వలనర్‌బుల్ ట్రైబల్ గ్రూప్స్) గుర్తించింది. 75 గిరిజన తెగలను పీవీటీజీలో చేర్చారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో 12 తెగలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ఈ సమూహాల మనుగడ ప్రమాదకర స్థితిలో ఉందన్న ఉద్దేశంతో వారి జీవన ప్రమాణాల పెంపు కోసం గ్రామసభలు ఏర్పాటు చేసి, వారికి ప్రభుత్వ పథకాలు అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకూ సమావేశాలు ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల చేశారు. కాగా ఈ సమావేశాలు గత గ్రామసభల మాదిరిగానే తూతూమంత్రంగా ముగుస్తున్నాయి అనేందుకు నేటి ముషిడిపల్లి గ్రామసభే సాక్షి.

ప్రజాభిప్రాయానికి విలువ లేదా..?

- ఎమ్మెల్సీ రఘురాజు ఫైర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: ప్రజల కోసం పెడుతున్న పరిశ్రమ ఏర్పాటులో ప్రజాభిప్రాయ సేకరణకు విలువ లేదా.. ప్రజాస్వామ్యంలో ప్రజలు భాగస్వాములు కారా అంటూ ఎమ్మెల్సీ రఘురాజు ప్రశ్నించారు. శనివారం సాయంత్రం బొడ్డవరలోని తన స్వగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గతంలో కంపెనీ వస్తే ఉపాధి దొరుకుతుందనే ఆశతో నమ్మి భూములిచ్చామన్నారు. నాడు పబ్లిక్ హియరింగ్‌లో కలెక్టర్ నేతృత్వంలో మినిట్స్ రాసి, సంతకాలు చేశారని చెప్పారు. అప్పుడిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాడిచ్చిన హామీలను జిందాల్ ప్రతినిధులు అమలు చేయాలని కోరుతున్నామే తప్ప కంపెనీలకు తాము వ్యతిరేకం కాదన్న విషయం కలెక్టర్ సహా అందరూ గుర్తించాలన్నారు. ఎవరెవరో వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారని, వాళ్లు ఎవరైనా ఒక్కసారైనా నిర్వాసితులతో మాట్లాడారా అని ప్రశ్నించారు. ఇక్కడి పోలీస్ యంత్రాంగాన్ని జిందాల్ నడుపుతోందని.. రైతులు రోడ్డుమీదికొస్తే అరెస్టులు చేస్తామని బెదిరించడం ఎంతవరకు సమంజసమన్నారు. హోటళ్లకు వెళితే భోజనాలు ఇవ్వొద్దని చెప్పడం అనాగరికమన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.